నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | వరంగల్, బుధవారం 30 అక్టోబర్ 2024 | HANUMAKONDA



కారును లబ్ధిదారుడికి అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## బీఆర్‌ఎస్ హయాంలోనే దళితుల సమగ్రాభివృద్ధి

- జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- లబ్ధిదారుడికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన కారు అందజేత

జనగామ, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : దేశంలో ఎక్కడా లేని విధంగా గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే దళితుల సమగ్రాభివృద్ధి జరిగిందని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. దళిత బంధు పథకంతో పాటు కార్పొరేషన్ సబ్సిడీలు ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో గత ప్రభుత్వంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన కారును సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం కడవేర్గుకు చెందిన గదరాజు కనకయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ దళితుల సంక్షేమానికి గత ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల నర్సయ్య, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు పాల్గొన్నారు.



పనిచేయని డిస్‌ప్లే బోర్డు

## కాజీపేట రైల్వే స్టేషన్‌లో పనిచేయని డిస్‌ప్లే

- ప్రయాణికుల ఇబ్బందులు
- పట్టించుకోని రైల్వే అధికారులు

కాజీపేట, అక్టోబర్ 29 : కాజీపేట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన రైలు సమాచార బోర్డు (డిస్‌ప్లే) పనిచేయడం లేదు. రైల్వే అధికారులు స్టేషన్ ప్రవేశ ద్వారం ముందు రైలు పేరు, నంబర్, రాకపోకలు, ఆలస్యం, ఏ ప్లాట్‌ఫాం పైకి వస్తుందనే వివరాలను తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో ఎప్పటికప్పుడు ఈ బోర్డుపై ప్రదర్శిస్తుంటారు. వారం రోజులుగా పనిచేయకపోవడంతో నిత్యం వేలాది మంది ప్రయాణికులు రైళ్ల సమాచారం తెలియక ఇబ్బందులు పడుతున్నారు. రైళ్ల వివరాలను అధికారులను అడిగితే పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. బోర్డుకు మరమ్మతు చేయించని అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా డిస్‌ప్లే పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### పేదల తరపున పోరాడుతాం

- బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్
- కరెంట్ చార్జీలను వెనక్కి తీసుకోవడంపై గులాబీ పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు
- అడ్డుకున్న పోలీసులు.. ఎన్పీడీసీఎల్ ఎదుట ఉద్రిక్తత



నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# కాంగ్రెస్‌వి డైవర్షన్ పాలిటిక్స్

## విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపడాన్ని ఒప్పుకోం



పటాకులు కాల్చకుండా బీఆర్‌ఎస్ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

హనుమకొండ, అక్టోబర్ 29: సంక్షేమం, అభివృద్ధి చేతకాక కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ, ప్రజా వ్యతిరేక పాలనకు పాల్పడుతున్నదని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు. విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని రాష్ట్ర సర్కారు వెనక్కి తీసుకున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీగా నక్కలగుట్టలోని టీజీఎన్పీడీసీఎల్ భవన్‌కు చేరుకున్న శ్రేణులు పటాకులు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు తోపులాట జరిగి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శాంతియుతంగా సంబురాలు జరుపుకోవడంతో పాటు విద్యుత్ అధికారులకు స్వీట్లు పంపిణీ చేసి కృతజ్ఞతలు తెలుపుదామని వచ్చిన తమను అడ్డుకోవడం ఏమిటని పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచకుండా పోరాడి అడ్డుకున్న ఘనత బీఆర్‌ఎస్ పార్టీ, నాయకుడు కేటీఆర్, శాసన మండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి, పార్టీ నాయకులదేనని అన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ పదేళ్ల పాలనలో ఏనాడూ విద్యుత్ చార్జీలు పెంచలేదని తెలిపారు. విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొని ఈఆర్‌సీని కేటీఆర్ విద్యుత్ బిల్లులు పెంచకుండా ఒప్పించారని పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల గొంతుకను బలంగా వినిపిస్తామన్నారు. ప్రభుత్వాన్ని నిలదీస్తే బీఆర్‌ఎస్ నాయకులపై దాడులు, ఆరోపణలు చేస్తూ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. పది నెలల కాలంలోనే ప్రజా వ్యతిరేకతను కాంగ్రెస్ ప్రభుత్వం మూటకట్టుకుందని అన్నారు. హైదరాబాద్‌లో హైడ్రా మాదిరిగా వరంగల్ ప్రజల జోలికొస్తే ఊరుకునే ప్రసక్తి లేదని, పేద ప్రజలకు బీఆర్‌ఎస్ అండగా నిలుస్తూ పోరాటం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్లు సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు బోయినపల్లి రంజిత్‌రావు, నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, మైనార్టీ నాయకులు నయీముద్దీన్, నాయకులు రవీందర్‌రావు, జానకి రాములు, పోలంపెల్లి రామ్మూర్తి, విద్యార్థి సంఘం నాయకుడు రాకేశ్‌యాదవ్, ప్రణయ్, రఘు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బెట్టింగ్ యాప్‌లతో నష్టపోయి..

- దొంగగా మారి కటకటాల పాలైన నిందితుడు
- అరెస్టు చేసి సొత్తు స్వాధీనం చేసుకున్న పోలీసులు

సుబేదారి ,అక్టోబర్ 29 : బెట్టింగ్ యాప్‌లతో నష్టపోయిన యువకుడు దొంగ అవతారం ఎత్తాడు. ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా 17 చోరీలకు పాల్పడి చివరకు పోలీసులకు చిక్కాడు. హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో సీపీ అంబర్ కిశోర్‌ఝా మంగళవారం నిందితుడి అరెస్ట్‌ను చూపించి వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా రాయపర్తికి చెందిన కొండపల్లి ధర్మరాజు డిగ్రీ చదివి కొద్ది రోజులు బిర్యానీ సెంటర్ నిర్వహించి నష్టపోయాడు. హనుమకొండకు మకాం మార్చి పోస్టల్‌కాలనీలో తాను విద్యార్థినని చెప్పి అద్దె గదిలో నివాసంలో ఉంటున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌తో అప్పులు కావడం, సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో దొంగగా మారాడు. పగలు తాళాలు వేసిన ఇళ్లను గమనించి, రాత్రి చోరీలకు పాల్పడేవాడు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హనుమకొండ, హసన్‌పర్తి, కేయూసీ, సుబేదారి, సంగెం, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, దేవరుప్పుల పోలీసుస్టేషన్ల పరిధిలో మొత్తం 17 చోరీల్లో 334 గ్రాముల బంగారు ఆభరణాలు, కిలో 640 గ్రాముల వెండి చోరీ చేశాడు.

వరంగల్ సెంట్రల్‌జోన్ డీసీపీ షేక్ సలీమా పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాలు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడు ధర్మరాజును గుర్తించారు. మంగళవారం కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ చేసిన సొత్తును విక్రయించడానికి వెళ్తుండగా పక్కా సమాచారంతో పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి ఆభరణాలతో పాటు రూ.13వేల నగదు, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.




చోరీ చేసిన బంగారు ఆభరణాలను పరిశీలిస్తున్న వరంగల్ సీపీ అంబర్ కిశోర్‌ఝా

# నిధుల గోల్‌మాల్ నిజమే

- అదనపు కలెక్టర్ విచారణలో బహిర్గతం
- 15 రోజుల్లో డబ్బుల రికవరీకి తీర్మానం
- జనగామ జిల్లా సమాఖ్య ప్రతినిధులు, అధికారులు, అమ్మకందారుడిపై చర్యలు

జనగామ చౌరస్తా, అక్టోబర్ 29 : జనగామలోని చాకలి ఐలమ్మ జిల్లా సమాఖ్యలో నాలుగెకరాల భూమి కొనుగోలులో నిధుల గోల్‌మాల్ జరిగింది నిజమేనని తేలింది. అదనపు కలెక్టర్ విచారణలో ఈ విషయం బహిర్గతమైంది. ఈ నెల 25న 'మహిళా సమాఖ్యలో నిధుల గోల్‌మాల్' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ కలెక్టరేట్‌లో డీఆర్డీవో వసంతతో కలిసి జిల్లా సమాఖ్యలోని 36 మంది ప్రతినిధులతో విచారణ చేపట్టగా ఈ విషయం బయటపడింది. జనగామ మండలంలోని వెంకిర్యాల గ్రామంలో సమాఖ్య పేరిట కొనుగోలు చేసిన భూమికి బహిరంగ మార్కెట్‌లో రూ.40 లక్షలు మాత్రమే ధర ఉందని ఇటీవల తహసీల్దార్ నివేదిక అందజేశారు. దీని ఆధారంగా అదనపు కలెక్టర్ ఆరా తీయగా సమాఖ్య బాధ్యులు ఎకరానికి రూ. 58.75 లక్షల చొప్పున మొత్తం నాలుగెకరాలకు రూ. 2.35 కోట్లు భూ యజమాని కందగట్ల అశోక్‌కు చెల్లించినట్లు తెలిసింది. దీంతో ఎకరానికి రూ.18.75 లక్షల చొప్పున మొత్తం రూ.75 లక్షల గోల్‌మాల్ జరిగినట్లు ఆయన గుర్తించారు. అంతేకాకుండా సదరు అశోక్‌కు సమాఖ్య బాధ్యులు 21 మంది ఇతరుల పేరిట చెక్కులు ఇచ్చినట్లు విచారణలో వెల్లడైంది.

భూమిని అధిక రేటుకు విక్రయించడంతో పాటు 21 మంది పేరిట చెక్కులు తీసుకున్న అంశంపై యజమాని అశోక్‌ను అదనపు కలెక్టర్ గట్టిగా ప్రశ్నించారు. దీంతో 15 రోజుల్లోగా అగ్రిమెంట్‌ను రద్దు చేసుకొని రూ.2.35 కోట్లు తిరిగి సమాఖ్యకు చెల్లిస్తానని అశోక్ హామీ ఇచ్చారు. ఈ మేరకు సమాఖ్య బాధ్యులు సైతం ఈ విషయమై ఏకగ్రీవంగా తీర్మానించుకున్నారు. కాగా, ఇందుకు బాధ్యులైన పలువురు అధికారులతో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సమాఖ్య బాధ్యులు, భూ యజమానిపై కేసులు పెట్టడానికి అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

నమస్తే ఎఫెక్ట్



షాపుల ముందు వేసిన టెంట్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

## అనుమతిలేని పటాకుల దుకాణాలు మూసివేత

*టెంట్లు తొలగించిన మున్సిపల్ అధికారులు*

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో అనుమతి లేకుండా వెలసిన పటాకుల దుకాణాలను మున్సిపల్ అధికారులు మంగళవారం మూసివేశారు. మంగళవారం 'ఒక్కరు పోయి.. ఇద్దరయ్యారు' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. ఈ మేరకు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవీన్ సిబ్బందితో కలిసి పటాకుల దుకాణాలను తనిఖీ చేశారు. అనుమతి పత్రాలు చూపించాలని కోరగా దరఖాస్తు చేసుకున్నామని, ఇంకా రాలేదని వ్యాపారులు చెప్పడంతో సుమారు 26 షాపులను మూసివేయించారు. దుకాణాల ముందు ఏర్పాటు చేసుకున్న టెంట్లను సైతం తొలగించారు. అనుమతి తీసుకున్నాకే తెరవాలని, లేనిపక్షంలో షాపుల్లో ట్యాంకర్‌తో నీళ్లు చల్లిస్తామని హెచ్చరించారు. అక్కడ ట్యాంకర్‌ను, సిబ్బందిని అందుబాటులో ఉంచారు. కాగా, డబ్బులు వసూలు చేసి అనుమతులు ఇప్పించడంలో జాప్యం చేసిన ఆ ఇద్దరిపై వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

## కాంగ్రెస్‌లో ముదురుతున్న వర్గపోరు

- నర్సంపేట ఎమ్మెల్యే సొంత మండలంలో ఆయన ఫ్లెక్సీనే పీకేసిన పార్టీ నాయకులు
- ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుతో తారస్థాయికి..

చెన్నారావుపేట, అక్టోబర్29: నర్సంపేట ఎమ్మెల్యే సొంత మండలమైన చెన్నారావుపేటలో కాంగ్రెస్ వర్గపోరు ముదురుతున్నది. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీల అంశంలో మండల కేంద్రంలోని బీసీ నాయకుడిని బహిష్కరిస్తున్నట్లు గ్రామ అధ్యక్షుడు ప్రకటించగా ఓ వర్గానికి చెందిన వారు ఎమ్మెల్యే వద్దకు వెళ్లడంతో సస్పెన్షన్ లేదని తేల్చారు. కొద్ది రోజులుగా గొడవ సద్దుమణిగిందని భావించినా దీపావళి పండుగ సందర్భంగా మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ బహిష్కరించబడిన సదరు నాయకుడు ఎమ్మెల్యే, డివిజన్‌లోని ముఖ్య నాయకులున్న ఫ్లెక్సీని సోమవారం రాత్రి ఏర్పాటు చేశాడు. అదే రాత్రి మరో వర్గానికి చెందిన వారు ఫ్లెక్సీని పీకేశారు. ఈ ఫ్లెక్సీలో ఎమ్మెల్యే మాధవ రెడ్డి ఫొటో పెద్దగా ఉన్నప్పటికీ సొంత పార్టీ నాయకులే తొలగించడం చర్చనీయాంశమైంది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలతో పార్టీని నమ్ముకున్న కార్యకర్తల్లో అయోమయం నెలకొంది. ఎమ్మెల్యే ఫొటోతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తీసేయడమంటే ఆయనను అవమానించినట్లేనని పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీలో ఒకరిపై మరొకరి పెత్తనమేమిటని సోషల్ మీడియాలో కామెంట్లు పెట్టడంతో వర్గపోరు తారస్థాయికి చేరింది. సొంత మండలంలో జరుగుతున్న వర్గ పోరుతో మాధవ రెడ్డి స్థానిక నాయకులపై పట్టు కోల్పోయారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**కాకతీయ విశ్వవిద్యాలయంలో పాలన గాడిలో పడుతుందా? వర్సిటీ అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు జరుగుతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు ఇన్‌చార్జిల తీరుతో యూనివర్సిటీ పాలన అస్తవ్యస్తంగా మారింది. ప్రభుత్వం కొద్ది రోజుల క్రితం ఓయూ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డిని కేయూ వీసీగా నియమించింది. ఆయన ఇటీవల బాధ్యతలు చేపట్టగా.. సర్వత్రా హర్షం వ్యక్తమైంది. అయితే ఇప్పటికే పలు వివాదాలతో సతమతమవుతున్న యూనివర్సిటీని సక్రమ మార్గంలో నడిపిస్తారా? అవినీతి, అక్రమాలతో వచ్చిన అపకీర్తిని తొలగించి పూర్వవైభవం తీసుకొస్తారా? లేక పాత సమస్యలే కొత్త వీసీకి తలనొప్పిగా మారతాయా? అనే అనుమానాలుండగా.. ఆయన ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారోననే ఆసక్తి అందరిలో నెలకొంది.**

*- హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 29*




కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనం

# పాలన గాడిలో పడేనా?

- పూర్వ వీసీల తీరుతో పాలన అస్తవ్యస్తం
- ఉపయోగంలోకి రాని కే-హబ్
- సందిగ్ధంలో పదోన్నతులు
- నిలిచిపోయిన ప్రహరీ పనులు
- ప్రారంభం కాని బాలుర డైనింగ్ హాల్
- నూతన వీసీ ప్రతాప్‌రెడ్డి నిర్ణయాలపై సర్వత్రా ఆసక్తి

## కేయూ కొత్త వీసీకి తలనొప్పిగా పాత సమస్యలు

కాకతీయ యూనివర్సిటీకి ఈ ఏడాది జూలైలో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని రాష్ట్రీయ ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ (రూసా) రూ. 45.50 కోట్లు విడుదల చేసింది. ఇందులో వివిధ విభాగాల్లో పరిశోధనా ప్రాజెక్టుల కోసం రూ. 8 కోట్లకు పైగా, మిగతా రూ. 37 కోట్లు కే-హబ్‌లో సదుపాయాల కోసం కేటాయించాల్సి ఉంది. అయితే రెగ్యులర్ వీసీ లేకపోవడంతో వీటి సర్దుబాటు జరగలేదు. అయినప్పటికీ ముగ్గురు మంత్రులు హడావుడిగా వచ్చి కే-హబ్‌ను ప్రారంభించినప్పటికీ అది విద్యార్థులకు ఇంకా అందుబాటులోకి రాలేదు. దీనికి తోడు 2010లో నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పదోన్నతుల అంశం పెండింగ్‌లోనే ఉంది. ఇటీవల హైకోర్టు కూడా ఆరు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో వీరికి ప్రమోషన్లు కల్పించాలా? లేదా? అనేది ప్రభుత్వం నిర్ణయించే వరకు వేచి చూడాలా? అనే సందిగ్ధత నెలకొంది. ఇంజినీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న వారికి సైతం పదోన్నతులు కల్పించాలని హైకోర్టు గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. అయితే మాజీ వీసీ రమేశ్ ఆ ఆదేశాలను బేఖాతరు చేసి వారి దరఖాస్తులను పక్కనపెట్టారు. వాటిని మళ్లీ రివ్యూ చేసి పాలక మండలిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.




కాకతీయ యూనివర్సిటీలో ఉపయోగంలోకిరానీ కే-హబ్

**పరిష్కారానికి నోచుకోని పలు సమస్యలు**

ఇన్‌చార్జి వీసీగా వాకాటి కరుణ బాధ్యతలు చేపట్టిన అనంతరం అకుట్ అభ్యర్థన మేరకు వివిధ గ్రేడుల్లోని అధ్యాపకులకు పదోన్నతులు కల్పించేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. రెండు నెలలు గడిచినా దరఖాస్తుల స్క్రూటినీ జరగలేదు. అలాగే బ్యాక్‌లాగ్ పోస్టుల్లో చేరిన నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు మాజీ వీసీ రమేశ్ హయాంలో అసోసియేట్ ప్రొఫెసర్ పదోన్నతి కోసం దరఖాస్తు చేసుకోగా ఆయన పట్టించుకోలేదు. వాకాటి కరుణ వచ్చాక వీరికి లైన్ క్లియరైంది. పాలక మండలిలో వీరి సర్వీసును క్రమబద్ధీకరించారు. ప్రస్తుతం వీరు ఇటీవల అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌గా పదోన్నతి కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాటిని స్క్రూటినీ చేసి మొదట అసోసియేట్, ఆ పిదప ప్రొఫెసర్ పదోన్నతులు కల్పించాల్సి ఉంది. అలాగే ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందిన వారి ఏరియర్స్ చెల్లింపుల్లో రెండేళ్లుగా జాప్యం జరుగుతున్నది. అయితే ఇన్‌కంటాక్స్ మాత్రం కట్టాల్సి వస్తున్నది. మొత్తం 50 మందికి ఏరియర్స్ చివరి వాయిదా చెల్లింపు మిగిలి ఉంది. దీనికి తోడు కేయూ భూముల రక్షణ కోసం రూ. 10 కోట్లతో నిర్మించాల్సిన ప్రహరీ పనులకు బ్రేక్ పడింది. ఇప్పటికే దాదాపు 51 ఎకరాలు కబ్జాకు గురైనట్లు ప్రభుత్వ సర్వేలో తేలింది. ఇటీవల హద్దుల నిర్ణయానికి చేపట్టిన సర్వే ఆగిపోయింది. అది పూర్తయితేనే ప్రహరీ నిర్మించాల్సి ఉంటుంది. అలాగే యూనివర్సిటీలో రూ. 2.50 కోట్లతో చేపట్టిన బాలుర డైనింగ్ హాల్ నిర్మాణం పూర్తయి ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో కామన్ మెస్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాలికల వసతి గృహాలతో పాటు డైనింగ్ హాల్ నిర్మాణం కూడా ఇంకా పెండింగ్‌లోనే ఉంది.


# క్రీడల్లో ప్రతిభ చూపాలి

- ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా
- గిరిజన ఆశ్రమ పాఠశాలల జోనల్‌స్థాయి క్రీడలు ప్రారంభం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం, అక్టోబర్ 29 : రాష్ట్ర స్థాయిక్రీడా పోటీల్లో ప్రతిభ చూపి విజేతగా నిలిచే లక్ష్యంతో ముందుకు సాగాలని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా అన్నారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలల జోనల్ స్థాయి పోటీలను మంగళవారం స్థానిక కుమ్రం భీం స్టేడియంలో పీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గెలుపోటములు సహజమని, ఆసక్తితో క్రీడల్లో పాల్గొంటే విజయం సాధిస్తామని అన్నారు. గిరిజన విద్యార్థులు క్రీడలతో పాటు చదువులో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. క్రీడా వేదికలను వినియోగించుకోవాలని, ప్రశాంత వాతావరణంలో పోటీలను పూర్తి చేసుకోవాలని సూచించారు. జ్యోతి ప్రజ్వలన, క్రీడా జెండావిష్కరణ అనంతరం వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. వరంగల్, కరీంనగర్ జిల్లాలకు చెందిన సుమారు 1500 మంది క్రీడాకారులు రెండు రోజుల పాటు జరిగే పోటీల్లో పాల్గొంటున్నారు. కబడ్డీ, వాలీబాల్, చెస్, క్యారం, ఖోఖో ఆర్చరీ, టెన్నికాయిట్,అథ్లెటిక్స్ పోటీల్లో క్రీడాకారులు తలపడుతున్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను వచ్చే నెల 5 నుంచి 7 వరకు ఉట్నూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో డీడీ పోచం, ఎస్‌వో రాజ్‌కుమార్, ఏటీడీవోలు క్షేత్రయ్య, దేశీరాంనాయక్, జీసీడీవో సుగుణ, స్పోర్ట్స్ ఆఫీసర్లు ఆదినారాయణ, శ్యామలత, నారాయణ, కొమ్మాలు, పీఈటీలు భాస్కర్, సతీశ్, నాగేందర్, సునీత, ఆయా పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

